బాలికల భద్రత, విద్యపై అవగాహన యాత్ర

4

Neti Velugu

నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

RNI NO. TELTEL/2023/88559

తెలుగు దినపత్రిక

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 220 | పేజీలు : 4 | నవంబర్ 26 గురువారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 220 | PAGES:4 | THURSDAY NOVEMBER 26 2026 | Rs. 4:00

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి: కేటీఆర్ డిమాండ్

- కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తున్న నేతల అరెస్ట్‌పై కేటీఆర్ మండిపాటు
- ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిని పోలీసులతో అణచివేయడం సరికాదని వ్యాఖ్య
- ట్రక్ పార్క్ భూమి వేలాది మందికి జీవనోపాధి అన్న కేటీఆర్



కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన విపక్ష నేతలను అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి వ్యతిరేకంగా అఖిలపక్ష నేతలు చేపట్టిన నిరసన సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులతో పాటు పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంపై కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు."కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి

(మిగతా 2వ పేజీలో..)

కిషన్ రెడ్డి పాదయాత్ర పాల్గొన్న సినీ నటుడు వెంకటేశ్

అంబర్‌పేట నుంచి ముషీరాబాద్‌కు కిషన్ రెడ్డి డ్రగ్స్ వ్యతిరేక పాదయాత్ర

డ్రగ్స్ రహిత భారత్ కోసం హైదరాబాద్‌లో చైతన్య యాత్ర.. వెంకటేశ్ సంఘీభావం

మూడు రోజుల పాటు 30 కిలోమీటర్లు.. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా భారీ వాకథాన్

హైదరాబాద్‌లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేపట్టిన 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' మూడు రోజుల అవగాహన పాదయాత్ర కాసేపటి క్రితం ఘనంగా ప్రారంభమైంది. అంబర్‌పేట మహంకాళి ఆలయ

(మిగతా 2వ పేజీలో..)



"మేం బిచ్చగాళ్లం కాదు".. యూపీలో కాంగ్రెస్, ఎస్పీ మధ్య సీట్ల చిచ్చు

ఎస్పీ ఏకపక్షంగా ఐదుగురు అభ్యర్థుల ప్రకటన

కాంగ్రెస్ అడుగుతున్నది 100 పైగా.. ఎస్పీ ఇస్తామనేది 26 సీట్లే

ఇమ్రాన్ మసూద్ ఇలాకా సహారన్‌పుర్‌లోనూ ఎస్పీ అభ్యర్థి

"మేము బిచ్చగాళ్లం కాదు" అంటూ ఇమ్రాన్ మసూద్ ఫైర్

ఎస్పీకి వ్యతిరేకంగా సొంత అభ్యర్థులను దించే యోచన



ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు తీవ్ర వివాదానికి దారితీశాయి. చర్చలు కొలిక్కి రాకముందే ఎస్పీ ఏకపక్షంగా ఐదుగురు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. దీంతో కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము 100కు పైగా స్థానాలు అడుగుతుంటే ఎస్పీ కేవలం 26 సీట్లే ఆఫర్ చేయడంపై కాంగ్రెస్ గుర్రుగా ఉంది.చర్చలు కొనసాగుతుండగానే పశ్చిమ యూపీకి చెందిన నాలుగు స్థానాలు సహా ఐదుగురు అభ్యర్థుల పేర్లను ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. బెహట్ నుంచి ఉమర్ అలీ, సహారన్‌పుర్ నుంచి ఆషూ మాలిక్, కైరానా నుంచి నాహిద్ హసన్, అమ్రోహా నుంచి మెహబూబ్ అలీ (వీరంతా సిట్టింగ్ ఎమ్మెల్యేలు), ఝాన్సీలోని లలిత్‌పుర్ నుంచి జ్యోతి లోధిల పేర్లను ఖరారు చేశారు. ఇందులో సహారన్‌పుర్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్రాన్ మసూద్ పరిధిలోకి వస్తుంది. ఈ నాలుగు నియోజకవర్గాల్లో ముస్లిం, దళిత ఓటర్లు అధికంగా ఉండటంతో, వీటిలో కనీసం రెండింటిని కాంగ్రెస్ ఆశించింది.ఎస్పీ ఏకపక్ష వైఖరిపై ఇమ్రాన్ మసూద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మేము బిచ్చగాళ్లం కాదు.. అఖిలేశ్ దయాదాక్షిణ్యాల కోసం ఎదురుచూడటం లేదు" అంటూ మండిపడ్డారు. చర్చలు ముగియకముందే పేర్లు ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ, తాము కూడా అదే స్థానాల్లో పోటీ చేయగలమని హెచ్చరించారు. సహారన్‌పుర్‌లో ఎస్పీకి పోటీగా అభ్యర్థిని దించే యోచనలో కాంగ్రెస్ ఉంది. ఈ వ్యవహారాన్ని హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లాలని యూపీ కాంగ్రెస్ నిర్ణయించింది. ప్రారంభంలో కాంగ్రెస్ 181 స్థానాలు డిమాండ్ చేయగా, చర్చల్లో దాన్ని 110 సీట్లకు తగ్గించుకుంది. అయినప్పటికీ ఎస్పీ మాత్రం 26 సీట్లకు మించి ఇచ్చేది లేదని

మోదీతో కలిసి పనిచేయాలని ప్రణబ్ ముఖర్జీ సలహా ఇచ్చారు: సువేందు అధికారి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి సంచలన విషయం బయటపెట్టారు. రాజకీయాల్లో తన సొంత బలంతో ఎదగాలనుకుంటే తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ని వీడి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి పనిచేయాలని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తనకు సలహా ఇచ్చారని ఆయన తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నడుపుతున్న టీఎంసీ ఒక ప్రైవేట్ సంస్థ అని సువేందు అధికారి ఆరోపించారు. 'నేను కూడా అక్కడ ఉన్నాను. కానీ నేను ఉద్యోగిగా ఉండను, అందుకే బయటకు వచ్చేశాను' అని మీడియాతో అన్నారు.కాగా, తన రాజకీయ పరివర్తనకు మార్గనిర్దేశం చేసిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని సువేందు అధికారి ప్రశంసించారు. 'నాకు మొదట సలహాదారుగా ఉన్నది దివంగత ప్రణబ్ ముఖర్జీ గారు. ఆయన రాష్ట్రపతి అయిన తర్వాత రైసీనా హిల్స్‌కు నేను వెళ్లాను. అప్పుడు నా మేనల్లుడు కూడా నాతో పాటు వచ్చాడు. ప్రణబ్ నాతో ఇలా అన్నారు. ఎక్కువగా ఏమీ చెప్పకుండా, 'నువ్వు ఏం చేయాలనుకుంటున్నావో ఆలోచించుకో. ఒకవేళ నువ్వు ఉద్యోగిగానే ఉండిపోవాలనుకుంటే, ఆమె దగ్గరే ఉండిపో. ఒకవేళ నీ సొంత శక్తితో ముందుకు వెళ్లాలనుకుంటే, అప్పుడు మోదీ దగ్గరకు వెళ్లు' అని నాకు నూటిగా సలహా ఇచ్చారు' అని అన్నారు. మరోవైపు 2012 నుంచి 2017 వరకు రాష్ట్రపతిగా పనిచేసిన ప్రణబ్ ముఖర్జీ, 2020లో కన్నుమూశారు.

(మిగతా 2వ పేజీలో..)



నాకు క్యాన్సర్ ఉందని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారు: కవిత

త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమన్న కవిత

ఇప్పటికే తనను ఇంట్లో నుంచి వెళ్లగొట్టారని ఆవేదన

త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. ఒక మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, బీఆర్ఎస్ నాయకత్వంపై పలు తీవ్ర ఆరోపణలు చేశారు.తమ పార్టీ టీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు తనపై వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తనను ఇలా వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల వారికి ఏం వస్తుందని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే తనను ఇంటి నుంచి వెళ్లగొట్టారని, ఇంకా ఏం సాధిస్తారని అన్నారు.గతంలోనూ తన ఆరోగ్యంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారని, తనకు క్యాన్సర్ ఉందని, త్వరలోనే చనిపోతానంటూ ప్రచారం చేశారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తన నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం గతంలో కేసీఆర్ వద్దకు వెళ్లినా ఆయన ఎట్టించుకోలేదని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో ఇరు వర్గాల మధ్య రాజకీయ విభేదాలు మరింతగా తీవ్రరూపం దాల్చాయి. మరోవైపు, నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించడాన్ని అందరూ ఐక్యంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.



భారత్‌పై మరోసారి వాణిజ్య కొరడా.. సరికొత్త సుంకాలకు అమెరికా రెడీ!

భారత్‌పై అదనపు సుంకాల విధింపునకు ట్రంప్ సర్కారు కసరత్తు

రాయితీలతో యూఎస్ కంపెనీలను దెబ్బతీస్తున్నారని ట్రంప్ ఆరోపణ

సెక్షన్ 301 విచారణ నివేదికను వెల్లడించనున్న యూఎస్‌టీఆర్

అత్యధిక భారత ఉత్పత్తులపై పెరగనున్న సుంకాల భారం

ఉక్కు, అల్యూమినియం, వాహన రంగానికి మినహాయింపు ఉండే ఛాన్స్

భారత ఎగుమతులపై కొత్తగా భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది.

(మిగతా 2వ పేజీలో..)



గ్లోబల్ సమ్మిట్‌కు ప్రత్యేక ఆంథెమ్ రూపకల్పన

కీరవాణి ఆధ్వర్యంలో నాలుగు భాషల్లో గీతం

డిసెంబర్ 7న తెలంగాణ కళారూపాలతో సాంస్కృతిక కార్యక్రమాలు

హైదరాబాద్ రుచులతో 30 వరకు ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు

హైదరాబాద్, నవంబర్ 25: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

సంపాదకీయం

సంపాదన పెరుగుతున్నా.. పొదుపు ఎందుకు తగ్గుతోంది?

ఆడంబరపు జీవనశైలి.. అప్పుల ఊబిలో మధ్యతరగతి కుటుంబాలు

మనిషి జీవన ప్రమాణాలు మెరుగుపడటం అభివృద్ధికి సంకేతం. మెరుగైన ఇల్లు, ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు ప్రతి కుటుంబం కోరుకునేవే. అయితే అవసరాలకు, ఆడంబరాలకు మధ్య తేడా చెరిగిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక క్రమశిక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. చేతిలో డబ్బు లేకపోయినా కొనుగోళ్లు చేయడం, అవసరం లేకున్నా కొత్త వస్తువులు తెచ్చుకోవడం, చిన్న కోరికల కోసం సైతం రుణాలపై ఆధారపడటం సాధారణమవుతోంది. సంపాదన పెరిగినా పొదుపు పెరగకపోవడానికి ఇదొక ప్రధాన కారణం.

ఆకర్షణీయ ప్రకటనలు.. అనవసర కొనుగోళ్లు

సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ విక్రయ వేదికలు వినియోగదారుల కొనుగోలు అలవాట్లను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. ప్రత్యేక తగ్గింపులు, పరిమిత కాలపు ఆఫర్లు, నెలవారీ వాయిదాల సౌకర్యం అంటూ కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. ఇతరుల జీవనశైలిని చూసి తమకూ అలాంటి వస్తువులు ఉండాలనే కోరిక పెరుగుతోంది. అవసరమా కాదా అని ఆలోచించకుండానే కొనుగోళ్లు చేస్తున్నారు. కొనుగోలు సమయంలో చిన్న మొత్తంలా కనిపించే నెలవారీ వాయిదాలు, అనేక రుణాలు కలిసినప్పుడు కుటుంబ బడ్జెట్‌పై భారంగా మారుతున్నాయి.

అప్పు చేయడం సులువు.. తీర్చడం కష్టం

బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, డిజిటల్ రుణ వేదికల ద్వారా రుణాలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులు, కొనుగోళ్లపై వాయిదాల సదుపాయాలు తక్షణ అవసరాలకు ఉపయోగపడవచ్చు. కానీ తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేయకుండా రుణాలు తీసుకుంటే ఆర్థిక సమస్యలు తప్పవు. ఒక రుణం తీర్చడానికి మరో రుణం తీసుకోవడం, వడ్డీ భారంతో నెలవారీ ఆదాయంలో అధిక భాగం కిస్తీలకే కేటాయించాల్సి రావడం కుటుంబాల ప్రశాంతతను దెబ్బతీస్తుంది. అనుకోని వైద్య ఖర్చులు, ఉద్యోగ నష్టం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు పరిస్థితి మరింత క్లిష్టమవుతుంది.

పొదుపు లేని జీవితం.. భద్రత లేని భవిష్యత్తు

ప్రతి నెలా సంపాదించిన మొత్తాన్ని పూర్తిగా ఖర్చు చేయడం ప్రమాదకరమైన అలవాటు. అనారోగ్యం, పిల్లల చదువు, ఇంటి అవసరాలు, వృద్ధాప్యం వంటి భవిష్యత్తు బాధ్యతలకు ముందుగానే సిద్ధపడాలి. ఆదాయం ఎంత ఉన్నా కొంత మొత్తాన్ని పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. అత్యవసర అవసరాల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసుకోవడం ఎంతో ముఖ్యం. పెట్టుబడులు పెట్టే ముందు వాటి స్వభావం, నష్టభయం, నిబంధనలను తెలుసుకోవాలి. అధిక లాభాల పేరుతో వచ్చే మోసపూరిత పథకాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

కుటుంబ బడ్జెట్.. ప్రతి ఇంటి అవసరం

ఆర్థిక క్రమశిక్షణ అనేది ఎక్కువ సంపాదించే వారికే పరిమితం కాదు. తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు కూడా సరైన ప్రణాళికతో ఖర్చులను నియంత్రించుకోవచ్చు. నెలవారీ ఆదాయం, అద్దె, విద్యుత్ బిల్లులు, ఆహారం, ప్రయాణం, రుణ వాయిదాలు వంటి ఖర్చులను ముందుగానే లెక్కించాలి. అవసరమైన ఖర్చులు, వాయిదా వేయగల ఖర్చులు, పూర్తిగా నివారించగల ఖర్చులుగా విభజించుకోవాలి. కుటుంబ సభ్యులందరికీ ఆర్థిక పరిస్థితిపై అవగాహన ఉండాలి. పిల్లలకు కూడా చిన్న వయసు నుంచే డబ్బు విలువ, పొదుపు ప్రాధాన్యం నేర్పించాలి.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెరగాలి

పాఠశాల స్థాయి నుంచే పొదుపు, వడ్డీ, రుణాలు, బీమా, పెట్టుబడులపై ప్రాథమిక అవగాహన కల్పించాలి. బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించాలి. రుణాలపై వడ్డీ రేట్లు, అదనపు రుసుములు, చెల్లింపుల గడువులు స్పష్టంగా తెలియజేయాలి. డిజిటల్ రుణాల పేరుతో ప్రజలను అధిక వడ్డీల ఊబిలోకి నెట్టే అక్రమ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. వినియోగదారులు కూడా ఒప్పందాలను చదివి, తమకు అర్థమైన తర్వాతే ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలి.

అవసరాలకు ప్రాధాన్యం.. భవిష్యత్తుకు భరోసా

డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో దాన్ని సమర్థంగా వినియోగించడం కూడా అంతే ముఖ్యం. ఇతరులతో పోల్చుకుని జీవించడం, కనిపించే ఆడంబరాల కోసం అప్పులు చేయడం వల్ల తాత్కాలిక సంతోషం కలగవచ్చు. కానీ దీర్ఘకాలంలో ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. నిజమైన ఆర్థిక స్వేచ్ఛ అంటే ఖరీదైన వస్తువులు కొనగలగడం మాత్రమే కాదు.. అప్పుల ఒత్తిడి లేకుండా, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే స్థోమతతో జీవించగలగడం. సంపాదన ఎంత ఉన్నా ఖర్చులకు హద్దు ఉండాలి. కోరికలన్నింటినీ వెంటనే తీర్చుకోవాల్సిన అవసరం లేదు. అవసరాన్ని గుర్తించి, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి. పొదుపు అనేది మిగిలిన డబ్బుతో చేసే పని కాదు.. ఆదాయం వచ్చినప్పుడే ప్రణాళికలో భాగం కావాలి. ఆర్థిక క్రమశిక్షణను ప్రతి కుటుంబం జీవన విధానంగా మార్చుకున్నప్పుడే అప్పుల ఊబి నుంచి బయటపడి భద్రమైన భవిష్యత్తును నిర్మించుకోగలదు.

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి: కేటీఆర్ డిమాండ్

మొదటి పేజీ తరువాయి)

నిదర్శనం. ప్రజా సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటు" అని మండిపడ్డారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు వేలాది మంది లారీ డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు, చిరు వ్యాపారుల జీవనోపాధితో ముడిపడి ఉన్న ప్రజా ఆస్తి అని కేటీఆర్ స్పష్టం చేశారు. నగర అవసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన స్థలాలను వేలం వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కిషన్ రెడ్డి పాదయాత్ర పాల్గొన్న సినీ నటుడు వెంకటేశ్

మొదటి పేజీ తరువాయి)

మైదానం నుంచి మొదలైన ఈ చైతన్య యాత్రలో ప్రముఖ సినీ నటుడు దగ్గుబాటి వెంకటేశ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహా పలువురు ప్రముఖులు, పెద్ద సంఖ్యలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.తొలిరోజు ఈ పాదయాత్ర అంబర్‌పేట టీ జంక్షన్, తిలక్‌నగర్, ఫీవర్ హాస్పిటల్, విద్యానగర్, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్, సీతాఫల్‌మండి, చిలకలగూడ, పద్మారావునగర్, గాంధీ ఆస్పత్రి మీదుగా ముషీరాబాద్‌లోని కాశీష్ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగనుంది. పాదయాత్ర సాగే మార్గాల్లో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... డ్రగ్స్ వల్ల ఏ తండ్రీ తన కొడుకు భవిష్యత్తు నాశనమవడం చూడకూడదని, యువత భవిష్యత్తును కాపాడటం మనందరి ఉమ్మడి బాధ్యత అని స్పష్టం చేశారు.మత్తు పదార్థాల వినియోగం యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సినీ నటుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. 2029 నాటికి దేశాన్ని సంపూర్ణ డ్రగ్స్ రహిత భారత్‌గా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈరోజు నుంచి 27వ తేదీ వరకు మొత్తం 30 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ముగియనుంది.

మోదీతో కలిసి పనిచేయాలని ప్రణబ్ ముఖర్జీ సలహా ఇచ్చారు: సువేందు అధికారి

మొదటి పేజీ తరువాయి)

అయితే ప్రణబ్ ముఖర్జీని ఎప్పుడు కలిశారు, ఆయన ఎప్పుడు ఈ సలహా ఇచ్చారు అన్నది సువేందు అధికారి వెల్లడించలేదు. నాటి మమతా బెనర్జీ ప్రభుత్వంలో కీలక వ్యూహకర్తగా, క్యాబినెట్ మంత్రిగా పనిచేసిన ఆయన, 2020 డిసెంబర్‌లో టీఎంసీకి రాజీనామా చేశారు. మిడ్నాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ తరుఫున పోటీ చేసిన సువేందు అధికారి, ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత బీజేపీలో కీలక నేతగా ఎదిగారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించడంతో సువేందు అధికారి సీఎం అయ్యారు.

"మేం బిచ్చగాళ్లం కాదు".. యూపీలో కాంగ్రెస్, ఎస్పీ మధ్య సీట్ల చిచ్చు

మొదటి పేజీ తరువాయి)

మొండికేసింది. మరోవైపు భాజపా ఎమ్మెల్యే రాజేశ్వర్ సింగ్ ఎస్పీ, కాంగ్రెస్ వైఖరిపై విమర్శలు గుప్పించారు. ఏకాభిప్రాయం అని లేఖ రాస్తూనే, కాంగ్రెస్‌ను అడగకుండా అభ్యర్థులను ప్రకటించి ఎస్పీ ఆ పార్టీని నవ్వులపాలు చేసిందని ఆయన ఎద్దేవా చేశారు.

భారత్‌పై మరోసారి వాణిజ్య కొరడా.. సరికొత్త సుంకాలకు అమెరికా రెడీ!

మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలకు సబ్సిడీలు ఇస్తూ అమెరికా సంస్థలను దెబ్బతీస్తున్నారనే ఆరోపణలతో భారత్ సహా పలు దేశాలపై పన్నుల బాదుడుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్ కీలక కథనాన్ని ప్రచురించింది.చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియా, ఐరోపా సమాఖ్య (ఈయూ) వంటి ప్రధాన దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త సుంకాలను ప్రతిపాదించారు. విదేశీ ప్రభుత్వాలు ఇచ్చే పారిశ్రామిక రాయితీలపై అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ గత కొన్ని నెలలుగా జరిపిన విచారణ నివేదిక త్వరలోనే విడుదల కానుంది. రాయితీలు, ప్రభుత్వ ప్రోత్సాహకాల కారణంగా ఆయా దేశాల్లో మితిమీరిన ఉత్పత్తి జరుగుతోందని, తక్కువ ధరకు వస్తువులను సరఫరా చేస్తూ అమెరికా సంస్థల మనుగడను దెబ్బతీస్తున్నారని గ్రీర్ పేర్కొన్నారు.1974 నాటి వాణిజ్య చట్టంలోని 'సెక్షన్ 301' కింద మార్చి 11న యూఎస్‌టీఆర్ ఈ విచారణ చేపట్టింది. తాజా నిర్ణయంతో అమెరికాకు ఎగుమతయ్యే అత్యధిక ఉత్పత్తులపై సుంకాల భారం పడనుంది. అయితే ఉక్కు, అల్యూమినియం, వాహన రంగాలు ఇప్పటికే ప్రత్యేక జాతీయ భద్రతా నిబంధనల కింద పన్నుల పరిధిలో ఉండటంతో, వాటిని దీని నుంచి మినహాయించే అవకాశముంది.తుది పన్ను శాతాలపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. అయితే 2025 నాటి సుంకాలను మళ్లీ అమలు చేయాలని ట్రంప్ బృందం యోచిస్తోంది. జులైలో విదేశీ సరఫరా గొలుసులపై విధించిన 10 నుంచి 12.5 శాతం సుంకాలకు ఇవి అదనంగా చేరనున్నాయి.మరోవైపు భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు నడుస్తున్నాయి. బంగ్లాదేశ్, వియత్నాం, కాంబోడియా వంటి పోటీ దేశాల కంటే తమ వస్తువులపై తక్కువ సుంకాలు ఉండాలని భారత్ కోరుతోంది. ఇలాంటి సమయంలో అమెరికా తాజా చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

గ్లోబల్ సమ్మిట్‌కు ప్రత్యేక ఆంథమ్ రూపకల్పన

మొదటి పేజీ తరువాయి)

విచ్చేసే అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనిప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి ప్రోటోకాల్, ఫుడ్, కల్చరల్ కమిటీలతో బుధవారం హైదరాబాద్ సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ అతిథులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

నాలుగు భాషల్లో ప్రత్యేక గీతం

గ్లోబల్ సమ్మిట్ కోసం నాలుగు భాషల్లో ప్రత్యేక ఆంథమ్‌ను రూపొందించినట్లు సీఎస్ తెలిపారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక గీతాన్ని తయారు చేసినట్లు వివరించారు. సమ్మిట్ ప్రత్యేకతను చాటిచెప్పేలా గీతం రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ కళారూపాలతో సాంస్కృతిక వేదికలు

డిసెంబర్ 7న తెలంగాణ సాంస్కృతిక, జానపద కళారూపాలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంజయ్ జాజు వెల్లడించారు. డిసెంబర్ 9న జరగనున్న క్లైమేట్ కాన్సర్ట్ సందర్భంగా భారీ స్థాయిలో సాంస్కృతిక వేదికలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ కళలు, సంప్రదాయాలను అతిథులకు పరిచయం చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

ప్రత్యేక స్టాళ్లు.. హైదరాబాద్ రుచులు

సమ్మిట్‌లో 45కుపైగా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ తెలిపారు. హైదరాబాద్ ప్రత్యేక వంటకాలు, రుచులను పరిచయం చేసేలా 30 వరకు ఫుడ్ స్టాళ్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. సినీ పరిశ్రమ ప్రముఖులతో పాటు జాతీయ, అంతర్జాతీయ అతిథులకు ఇప్పటికే ఆహ్వానాలు పంపినట్లు చెప్పారు.

డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు సమ్మిట్

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో జరగనుంది. ఈ సదస్సుకు 1,000కుపైగా కంపెనీలు, వేలాది మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. భారీ స్థాయిలో నిర్వహించనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు అవసరమైన ఏర్పాట్లను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోంది.

జీ మీడియా "దక్కన్ ఐకాన్స్" అవార్డు అందుకున్న విరాహత్ అలీ





హైదరాబాద్ నవంబర్ 25 (నేటి వెలుగు)

హైదరాబాద్ దక్కన్ పరిధిలో వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతలు పొందుతున్న 12మంది ప్రముఖులకు జీ జాతీయ మీడియా సంస్థ అందించిన "దక్కన్ ఐకాన్స్-2026" పురస్కారాన్ని....దశాబ్దాల తరబడి సామాజిక, మీడియా రంగాల్లో సేవలందిస్తున్న సీనియర్ పాత్రికేయులు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అందుకున్నారు.బుధవారం నాడు బంజారాహిల్స్ లోని రెడీసన్ బ్లూ హోటల్ లో జీ మీడియా సంస్థ నిర్వహించిన సభలో, రాష్ట్ర వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర సాగునీటి మరియు పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిల చేతుల మీదుగా విరాహత్ అలీ ఈ పురస్కారాన్ని పొందారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల విద్యాసంస్థల చైర్మన్ ఫహీం ఖురేషి, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా ఖాన్, జీ సలాం టీవీ ఎడిటర్ తారిఖ్ ఫరీదీ, జీ తెలుగు ఛానెల్ ఎడిటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

(దేవరకొండ రూరల్) నవంబర్ 25(నేటి వెలుగు)

పి.ఏ.పల్లి.మండలం&గ్రామపంచాయతీ లో పీఏ పల్లి సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పీఏ పల్లి గ్రామ సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి కోరారు.బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల కుటుంబాలకు భరోసా కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని చేపడుతోందని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బీమా పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అక్షిత, గ్రామపంచాయతీ సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

పేదలకు పింఛన్ ఆర్థిక భరోసా

అదనంగా మంజూరైన 56 చేయూత పింఛన్ల పంపిణీలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి.

సూర్యాపేట నవంబర్ 25 (నేటి వెలుగు)

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు.బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హన్మంత రెడ్డి తో కలిసి అదనంగా మంజూరైన 56 చేయూత పింఛన్లను ఆమె లబ్ధిదారులకు అందజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్ ఎంతో ఆర్థిక భరోసానిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన వారు ఎవరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చేయూత పింఛన్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ఇటీవల రవి మహల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2,100 చేయూత పింఛన్లను పంపిణీ చేశామని, తాజాగా అదనంగా మంజూరైన 56 పింఛన్లను కూడా అర్హులైన లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. పేద కుటుంబాలకు పింఛన్ ప్రతి నెలా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వృద్ధాప్యం, దివ్యాంగత్వం, ఇతర పరిస్థితుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక తోడ్పాటును అందిస్తుందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ



ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.డి. షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు, ఆర్పో జ్ఞానేశ్వరి,జూనియర్ అస్సిటెంట్ యం.డి.గౌసుద్దిన్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి బీఆర్ఎస్ నేత ఆర్థిక సాయం

దేవరకొండ రూరల్ (నేటివెలుగు

దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామపంచాయతీ అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి బీఆర్ఎస్ నేత నేనావత్ కిషన్ నాయక్ ఆర్థిక చేయూతలి: అరుదైన ణవీణ వ్యాధితో పోరాడుతున్న చిన్నారికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు లినేనావత్ కిషన్ నాయక్ గారు అండగా నిలిచారు.దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామానికి చెందిన శ్రీరాం కుమారుడు పవన్ తేజ్ వైద్యానికి సుమారు రూ. 26 కోట్ల భారీ వ్యయం కానుంది.బాలుడి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న కిషన్ నాయక్ మానవతా దృక్పథంతో స్పందించి, తక్షణ సాయంగా రూ. 50,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతేకాకుండా, బాలుడి చికిత్సకు తన



వంతు తోడ్పాటుగా త్వరలోనే మరో రూ. 50,000 అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద మనసుతో ముందుకొచ్చి చిన్నారి పవన్ తేజ్ ప్రాణాలను కాపాడాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుభాష్ గౌడ్, కౌన్సిలర్ మధు, నర్సింహ మరియు ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీసీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కీలక శాఖల్లో ప్రాధాన్యత కల్పించాలి

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 25 (నేటి వెలుగు):



రాష్ట్ర ప్రభుత్వంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ప్రాధాన్యత కలిగిన శాఖల్లో అవకాశం కల్పించి, కీలకమైన పరిపాలనా బాధ్యతలు అప్పగించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన అధికారులకు కీలకమైన శాఖల్లో తగిన ప్రాధాన్యత కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన అధికారులకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ, బీసీ అధికారులకు మాత్రం ప్రాధాన్యత లేని శాఖల్లో అవకాశాలు కల్పించడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు.బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ ప్రతిభ, అనుభవం, అంకితభావంతో ప్రభుత్వ పరిపాలనలో సమర్థవంతంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ, వారికి కీలకమైన శాఖల్లో బాధ్యతలు అప్పగించకపోవడం విచారకరమన్నారు.అధికారుల సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్ష చూపకుండా, వారి ప్రతిభ, సామర్థ్యం, అనుభవానికి అనుగుణంగా ఉన్నతస్థాయి బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జాజుల లింగంగౌడ్ కోరారు. బీసీ అధికారులకు సముచిత ప్రాధాన్యత కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని పరిపాలనలోనూ అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించండి

- **బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్**

మిర్యాలగూడ నవంబర్ 25 (నేటి వెలుగు)



తెలంగాణ రాష్ట్రంలో త్వరలో రానున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రధాన రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలకే అవకాశం కల్పించడం బాధాకరమని మిర్యాలగూడలో బీసీ భవన్ లో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీలకు నేటికీ పూర్తిస్థాయిలో రాజకీయ న్యాయం జరగడం లేదు తెలంగాణలో అనేకమంది నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నేటికీ పూర్తిస్థాయిలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని ఆయన అన్నారు నిరుద్యోగుల పక్షాన అలాగే బీసీ విద్యార్థులు, ఉద్యోగుల, రిజర్వేషన్ల పక్షాన మాట్లాడే నాయకుడు శాసన మండలి లో లేకపోతే భవిష్యత్తు బీసీ తరాలు కు అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు రానున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలలో అయినా బీసీ వర్గానికి సంబంధించిన బలమైన నాయకుడిని ఎన్నుకోవాలని బలహీన వర్గాలు ఆలోచన చేస్తుంటే ప్రధాన రాజకీయ పార్టీలు అయినటువంటి కాంగ్రెస్ పార్టీ మరియు బి,ఆర్,ఎస్ పార్టీ రెండు అగ్రవర్ణాలకే అవకాశం కల్పించే దిశగా నిర్ణయం తీసుకోవడం బాధాకరమని ఆయన అన్నారు ప్రధాన రాజకీయ పార్టీలలో బీసీ లు ఎంతోమంది ఉన్నా కూడా పార్టీలు అగ్రవర్ణాలకే ఎన్నికల లో పోటీ కి స్థానం కల్పించడాన్ని బీసీ యువజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది అని ఆయన అన్నారు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధికంగా బీసీ ఓట్లే ఉన్నప్పటికీ కూడా అగ్రవర్ణాలు పోటీకి నిర్ణయించుకోవడం రాజకీయ పార్టీలు కూడా వాళ్ళకే అవకాశం కల్పించడం బీసీ ల అణచివేత నిర్ణయాలు తీసుకోవడం పట్ల బీసీ లందరూ ప్రధాన రాజకీయ పార్టీలపై తీవ్ర వ్యతిరేకత తో ఉన్నారని ఆయన అన్నారు బీసీ పట్టభద్రులారా మీ ఓటు అగ్రవర్ణాలకు వేసి భవిష్యత్తు బీసీ తరాలకు నష్టం జరిగేలా మీ నిర్ణయాలు ఉండొద్ద ని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో దాసరాజు జయరాజ్, నాయిని భాస్కర్, పట్టేటి రమేష్, బోయిన ఉపేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు డాన్ బోస్కో స్పోర్ట్స్ అకాడమీ కృషి అభినందనయం

నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

స్పోర్ట్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేయర్

నల్గొండ నవంబర్ 25 (నేటి వెలుగు)

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు డాన్ బోస్కోస్పోర్ట్ అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమని, ఇలాంటి క్రీడా సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. నలగొండ పట్టణంలో మంగళవారం డాన్ బోస్కో విద్యాసంస్థలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాన్ బోస్కో ద్వారా ఎన్నో విద్యాసంస్థలను ఏర్పాటు చేసి విద్యను అందిస్తుందని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ద్వారా విద్యార్థులకు ఇక్కడ విద్యను అందిస్తూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తుందని పేర్కొన్నారు. నల్గొండలోని 15 ఎకరాలలో డాన్ బోస్కో అకాడమీ ఆధ్వర్యంలో విద్యా సంస్థలను నిర్వహించడంతో పాటు స్పోర్ట్ అకాడమీ ఏర్పాటు చేయడం పట్ల అకాడమీ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని,తమలోని ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో నల్లగొండకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.డాన్ బోస్కో స్పోర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని కోరారు.స్పోర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఫుట్బాల్, వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మేయర్ బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పసుల సౌరయ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, డాన్ బోస్కో అకాడమీ ప్రొవెన్షనల్ ఫాదర్ థామస్, బాలశౌరి రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ రాయప్ప, స్కూల్ ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఫాదర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ రూరల్) నవంబర్ 25 (నేటివెలుగు)

చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామంలోని జయ ఫంక్షన్ హాల్‌లో గొల్లపల్లి గ్రామానికి చెందిన అనంతుల మల్లేష్ గౌడ్ గారి కుమారుడు మహేందర్ గౌడ్ -- సౌమ్య వివాహ వేడుక ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారు హాజరై నూతన వధూవరులు మహేందర్ గౌడ్, సౌమ్యలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండ్రంపల్లి పీఏసీఎస్ డైరెక్టర్‌గా కొండే శ్రీశైలం ఎన్నిక

పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన శ్రీశైలానికి డైరెక్టర్ పదవి

నకిరేకల్, నవంబర్ 26(నేటి వెలుగు)



గుండ్రంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం () డైరెక్టర్‌గా ఏపూర్ గ్రామానికి చెందిన కొండే శ్రీశైలం ఎన్నికయ్యారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయనకు డైరెక్టర్ పదవి దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తన స్వగ్రామమైన ఏపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేస్తూ, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నాయకత్వంలో పార్టీ బలోపేతానికి శ్రీశైలం విశేష కృషి చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, నాయకత్వం అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా కొండే శ్రీశైలం తన ఎన్నికకు సహకరించి, ప్రోత్సాహం అందించిన జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా సేవలందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నల్గొండ ఇన్‌చార్జి డీఆర్‌ఓగా ఆర్డీఓ అశోక్ రెడ్డి నియామకం



నల్గొండ, నవంబర్ 25 (నేటి వెలుగు):

నల్గొండ ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారిగా (డీఆర్ఓ) నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఇప్పటివరకు నల్గొండ డీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న దశరథ నాయక్ ఈ నెల 23వ తేదీన ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడంతో ఆ పదవి ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డికి ఇన్‌చార్జి డీఆర్ఓ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవనీయులైన ఎమ్మెల్యే నేనవత్ బాలు నాయక్ మరియు నల్గొండ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ శోభా రాణి ఏవి రెడ్డి



దేవరకొండ రూరల్ నేటి వెలుగు నవంబర్ 25

పి.ఎ.పల్లి మండల గ్రామానికి చెందిన ఉప్పల శ్రీను&కవిత గార్ల కుమార్తె వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన గౌరవనీయులైన దేవరకొండ శాసనసభ్యులు నేనవత్ బాలునాయక్ గారు మరియు నల్గొండ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ శోభా రాణి ఏవి రెడ్డి గారు.ఐ మాజీ ఎంపీపీ తే రా సత్యనారాయణరెడ్డిఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాలికల భద్రత, విద్యపై అవగాహన యాత్ర





సూర్యాపేట నవంబర్:25 (నేటి వెలుగు)

మహిళా శిశు సంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, పి.సి.పి.ఎన్.డి.టి. యాక్ట్ వారి ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు, బేటీ బచావో – బేటీ పడావో పథకంలో భాగంగా "బాలికా ప్రగతి పథం – చైతన్య యాత్ర" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సూర్యాపేట పట్టణ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల నందు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యువశక్తి కళాబృందం వారిచే నాటకాల ప్రదర్శన ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల భద్రత, బాల్య వివాహాల నివారణ, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, పి.సి.పి.ఎన్.డి.టి. చట్టం గురించి నాటకాల రూపంలో విద్యార్థినులకు చక్కగా వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా యువశక్తి కళాబృందం వారు ప్రదర్శించిన "ఆడపిల్ల – ప్రేమ పేరుతో లేచిపోయి మోసపోయిన" అనే నాటిక అందరినీ ఆకట్టుకుంది. ప్రేమ పేరుతో మోసపోయి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రుల మాట విని చదువుపై దృష్టి పెట్టాలని ఈ నాటిక ద్వారా విద్యార్థినులకు కళ్ళకు కట్టినట్లు వివరించారు.అలాగే ఆడపిల్లలను కాపాడుకోవాలి, చదివించాలి అనే అంశంపై అధికారులు ప్రత్యేకంగా ప్రసంగించారు. బాలికలకు అందుబాటులో ఉన్న హెల్ప్ లైన్ సంబర్లు 1098 చైల్డ్ లైన్, 181 మహిళా హెల్ప్ లైన్, 100 పోలీస్ సేవల గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుండె పీదిలంగా ఉండాలంటే..

రాత్రి నిద్రకు ముందు పాలను తాగడం అనేది చాలా మందికి ఆరోగ్యకరమైన అలవాటు. అయితే ఈ పాలకు ఖర్జూరం కలిపితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. పాలు, ఖర్జూరం రెండూ శరీరానికి అవసరమైన పోషకాలు కలిగి ఉంటాయి. వీటిని కలిపి తీసుకోవడం వల్ల శక్తి పెరుగుతుంది, ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఖర్జూరం సహజంగా శక్తివంతమైన పండు. దీనిలో విటమిన్ ూ, దీ, జ లాంటి పోషకాలు, అలాగే ఐరన్, పొటాషియం, మాంగనీస్ వంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఖర్జూరాన్ని కొంత సమయం నానబెట్టి తీసుకోవడం వల్ల ఈ పోషకాలు మరింత శక్తివంతంగా శరీరంలో చేరవచ్చు. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచడంలో ఎంతో సహాయపడుతుంది. పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. వయస్సు పెరిగే కొద్దీ ఎముకల బలహీనత, కీళ్ళ నొప్పులు వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తాయి. అప్పుడు ఈ పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఖర్జూరంలో ఉండే మాంగనీస్, కాల్షియం, ఫాస్ఫరస్ వంటి మూలకాలు ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. పాలు అందించే ప్రోటీన్, కాల్షియంతో కలిపి ఈ మూలకాలు ఎముకలకు కావలసిన బలాన్ని ఇస్తాయి.ఖర్జూరం, పాలు కలిసి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చర్మంపై ఎలర్జీలు, మంటలు, పొడిబారిన సమస్యలు ఉంటే.. ఈ పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల ఉపశమనం పొందవచ్చు. ఖర్జూరంలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.. పాలు అందించే లాక్టిక్ ఆమ్లం చర్మాన్ని శుభ్రపరుస్తుంది. ఈ రెండు కలిపి తీసుకోవడం వల్ల చర్మం మెరుస్తుంది. పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల కండరాలు బలపడతాయి. ఈ రెండింటిలో ఉండే ప్రోటీన్ శరీరానికి అవసరమైన పోషకాన్ని అందించి కండరాల పునరుద్ధరణను



వేగవంతం చేస్తుంది. ముఖ్యంగా శారీరక శ్రమ చేసిన తర్వాత పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతుంది. పాలతో ఖర్జూరం తీసుకోవడం వలన రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది హృదయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తప్రసరణ పెరగడంతో శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్ సమర్థంగా అందుతుంది. దీని వల్ల శక్తి స్థాయి పెరుగుతూనే.. ముఖానికి సహజమైన కాంతి కూడా వస్తుంది. ఇలా పాలతో ఖర్జూరం కలిపి తాగడం ద్వారా శరీరానికి శక్తి, ఆరోగ్యం, అందం అందుతాయి.

ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**